ప్రభుత్వ ఆస్పత్రికి సరికొత్త శోభ

ఒకప్పుడు ప్రభుత్వ ఆస్పత్రులంటే అరకొర వసతులు, శిథిలమైన భవనాలతో కళావిహీనంగా ఉండేవి. సర్కారు వైద్యం అంటేనే ప్రజలు భయపడే పరిస్థితి ఉండేది. కానీ ప్రస్తుతం ప్రజలకు మెరుగైన, ఉచిత వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

- నేడు ప్రారంభం కానున్న వడ్లపూడి కణితి పీహెచ్‌సీ
- రూ. 1.75 కోట్లతో నిర్మాణం



సరికొత్త హంగులు సంతరించుకున్న వడ్లపూడి కణితి పీహెచ్‌సీ



కొత్తగా నిర్మించిన రోగుల వెయిటింగ్ హాలు

కూర్మన్నపాలెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో గవర్నమెంట్ ఆస్పత్రులు అధునాతన హంగులు, అత్యాధునిక సదుపాయాలతో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా వడ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కార్పొరేట్ ఆసుపత్రికి ఏ మాత్రం తీసిపోని రీతిలో రూ.1.75 కోట్ల ప్రభుత్వ నిధులతో నిర్మించారు. వైద్య సిబ్బంది గదులతో పాటు రోగుల వార్డులు, ఇతర గదులను అత్యాధునిక సదుపాయాలతో తీర్చిదిద్దారు.

వడ్లపూడి కణితి పీహెచ్‌సీ అభివృద్ధిపై దృష్టి

వడ్లపూడి పీహెచ్‌సీ అభివృద్ధిపై జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఒకప్పుడు వడ్లపూడి పీహెచ్‌సీలో రోజుకు 80–100 ఔట్ పేషెంట్లు (ఓపీ) నమోదయ్యేది. వైద్యులు, సిబ్బంది శిథిలమైన భవనంలోనే రోగులకు సేవలు అందించేవారు. వర్షం వస్తే నీరు కారిపోతూ, శ్లాబ్ పెచ్చులూడిపోతుండేవి. కానీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా వడ్లపూడి కణితి పీహెచ్‌సీ పునరుద్ధరణకు చర్యలు చేపట్టడంతో పునర్నిర్మాణ పనులు శరవేగంగా జరుపుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉంది. వైద్య సిబ్బంది, ప్రజలకు అవసరమైన వసతులను అందుబాటులోకి తెచ్చే విధంగా పీహెచ్‌సీ నిర్మాణం చేపట్టారు. వైద్యులకు గదులు, పేషెంట్ల కోసం వెయిటింగ్ హాల్, మందులు ఇచ్చే గది, ఆపరేషన్ థియేటర్, స్టాఫ్ రూమ్ వంటి నిర్మాణ పనులను ఇంజనీరింగ్ అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం

వడ్లపూడి కణితి పీహెచ్‌సీకి మరిన్ని వైద్య సదుపాయాలు కల్పించడానికి ప్రణాళికలు రూపొందించి, ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. దీనిపై గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రతిపాదనలు మంజూరైతే వడ్లపూడి పీహెచ్‌సీకి మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం ఉన్న 6 పడకలను 20 పడకలుగా పెంచే యోచనలో అధికారులున్నారు. అంబులెన్స్, ప్రసూతి విభాగం, ల్యాబ్, రోగులకు ప్రత్యేక గదులతో పాటు మరిన్ని సదుపాయాల ఏర్పాటుకు కృషి చేస్తున్నారు. ఇవన్నీ అందుబాటులోకి వస్తే దూరంగా ఉన్న కేజీహెచ్‌తో పాటు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



వడ్లపూడి కణితి పీహెచ్‌సీలో కొత్తగా నిర్మించిన ఆపరేషన్ థియేటర్

ఇబ్బందులు తొలగుతాయి..



గతంలో వడ్లపూడి కణితి పీహెచ్‌సీకి వెళ్లినప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లం. సరైన సౌకర్యాలు లేక ఆసుపత్రికి వెళ్లాలంటేనే ఇబ్బంది పడేవాళ్లం. కానీ కొత్తగా ఓపీ దగ్గర పేషెంట్లు వేచి ఉండడానికి ప్రత్యేకంగా గది ఏర్పాటు చేయడంతో ఇకపై అటువంటి ఇబ్బందులు ఉండవని భావిస్తున్నాం.

–కంబాల సత్యవతి, లక్ష్మీపురం.

మెరుగైన వైద్యం అందుతుందని భావిస్తున్నాం



వడ్లపూడి కణితి పీహెచ్‌సీకి వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్యం అందించగలమని భావిస్తున్నాం. కొత్తగా నిర్మించిన ఆసుపత్రి భవనంలో సకల సదుపాయాల ఉండడం వల్ల రోగులకు సంతృప్తికరమైన ఉచిత వైద్యం అందిస్తాం.

– టి.శివయ్య, వడ్లపూడి కణితి పీహెచ్‌సీ వైద్యుడు

ప్రభుత్వ రంగ సంస్థలతోనే ఆర్థికాభివృద్ధి



865వ రోజు ఉక్కు దీక్షలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం: ప్రభుత్వ రంగ పరిశ్రమల వల్లే దేశం ఆర్థికాభివృద్ధి సాధిస్తోందని, అటువంటి పరిశ్రమలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం వల్ల దేశంలో ఆర్థిక వ్యవస్థ కుంటుపడుతోందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు విమర్శించారు. కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద 865వ రోజు జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్ష శిబిరంలో పలువురు కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నేడు దేశంలో ప్రజా సమస్యలను వదిలి తమ రాజకీయ అవసరాల కోసమే పాలక, ప్రతిపక్ష పార్టీలు కుట్ర రాజకీయాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. ప్రజాపోరాటాల ద్వారా జరిగే ఉద్యమాలకు పాలకులు కచ్చితంగా జవాబు ఇచ్చి తీరాలన్నారు. ఉక్కు ఉద్యమాన్ని ప్రజా పోరాటంగా మలిచి పాలకులు స్పందించే విధంగా కార్మికులు పోరాడాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన మొండి వైఖరి వీడి పెట్టుబడి పెట్టి విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని ప్రకటన చేయాలన్నారు. ఈ విషయంలో కార్మికవర్గం అప్రమత్తంగా ఉండి తమ పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆణిముత్యాల'కు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి

పెదగంట్యాడ: బాగా చదివిన విద్యార్థులను మరింతగా ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని 77వ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి అన్నారు. ఇస్లాంపేట ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 530 మార్కులు సాధించిన జ్యోతి, 504 మార్కులు సాధించిన ఆఫ్రీన్, 498 మార్కులు సాధించిన ఆకాశ్ అనే విద్యార్థులను సోమవారం పాఠశాలలో సత్కరించారు. వీరికి నగదు ప్రోత్సాహకాలు అందజేసి అభినందించారు. ప్రథమ స్థానంలో నిలిచిన జ్యోతికి రూ.3 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన ఆఫ్రీన్‌కు రూ.2 వేలు, మూడో స్థానం సాధించిన ఆకాశ్‌కు రూ.వెయ్యి అందజేశారు. అలాగే వారిని అభినందిస్తూ సర్టిఫికెట్లు బహూకరించారు. భవిష్యత్తులో బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ప్రమీల, నాయకులు ఎంపీ రెడ్డి, కురం అప్పారావు, దావూద్, సావాడ అప్పలరెడ్డి, సచివాలయ కన్వీనర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ సీనియర్ నాయకుడికి సన్మానం



రమణయ్యను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్ ఐఎన్‌టీయూసీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్.వి.రమణయ్యను సోమవారం ఘనంగా సత్కరించారు. రమణయ్య ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనుండడంతో సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయనకు నాయకులు శాలువాలు కప్పి, పూలమాలల వేసి బొకేలతో అభినందించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ రమణయ్య తన విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసి యూనియన్ అభివృద్ధికి విశేష సేవలు అందించారన్నారు. చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాద్, నీరుకొండ రామచంద్రరావు, ప్రభాకరరెడ్డి, అరవింద కుమార్, బి.ఎస్.రాజు, అవతారం పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు పనుల పరిశీలన

పెదగంట్యాడ: రోడ్డు, కాలువల నిర్మాణంలో నాణ్యత పాటించాలని వైఎస్సార్‌సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను కోరారు. జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని కొంగపాలెం గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న బీటీ రోడ్డు, కాలువల నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మద్ది ప్రసాద్, నక్క రమణ, నక్క శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సీనియర్ నేతలకు అభినందనలు

గాజువాక: బీజేపీ దివంగత నేతలు గోపాలరావు ఠాకూర్ స్మారకోపన్యాసం, పీవీ చలపతిరావు జయంతి కార్యక్రమాలకు హాజరైన ఆ పార్టీ సీనియర్ నాయకులు వామరాజు సత్యమూర్తి, కపిలేశ్వరయ్యలను సోమవారం సత్కరించారు. జాతీయ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు సభ్యుడు సిరసపల్లి నూకరాజు ఆధ్వర్యంలో వారికి శాలువాలు కప్పి అభినందించారు. నాయకులు కృష్ణ భగవాన్, వేదుల దక్షిణామూర్తి, మారిశెట్టి వెంకట రమణ, తూట సోమశేఖర్ పాల్గొన్నారు.

గాంధీజీ విగ్రహం ఏర్పాటుకు వినతి

గాజువాక: గాజువాక జంక్షన్ నుంచి 60 అడుగుల రోడ్డుకు వెళ్లే కొత్త డివైడర్‌లో మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మహాత్మా, మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు జాగరపు శ్రీను కోరారు. ఈ మేరకు పలు ట్రస్టుల ప్రతినిధులతో కలిసి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో జేసీకి ఆయన వినతి పత్రం అందజేశారు. వివిధ ట్రస్ట్‌ల ప్రతినిధులు సురేష్‌రెడ్డి, సనపల ఢిల్లీశ్వరరావు, నరేంద్రరావు, నెమ్మలూరు శివ గణేష్ శర్మ, చరపాక రామచంద్రరావు, గోపాల కృష్ణారెడ్డి, పృధ్వీ, జగదీష్ పాల్గొన్నారు.

గాజువాక విద్యా శాఖ అధికారిగా సునీత

అగనంపూడి: గాజువాక మండలం విద్యా శాఖ అధికారిగా ఎం.సునీత బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సోమవారం ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ అభినందనలు తెలిపారు. ఎంఈవో మాట్లాడుతూ పరవాడ, గాజువాక, పెదగంట్యాడ, పెందుర్తి, చినగదిలి మండలాలకు ఎంఈవోగా సేవలు అందించానని, తన విధి నిర్వహణకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగం అభివృద్ధికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. కార్యక్రమంలో ఉక్కు నిర్వాసిత కాలనీ నాయకులు ఎల్వీ రమణ, దాసరి రాము, కార్మిక నాయకుడు కొల్లిపర రమేష్ పాల్గొన్నారు.

బలరాముని అవతారంలో జగన్నాథుడు



బలరాముని అవతారంలో జగన్నాథుడు

అగనంపూడి: శ్రీజగన్నాథుని రథోత్సవం సందర్భంగా అగనంపూడి ఇంద్రజమున హాల్లో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. సోమవారం బలరాముడి అవతారంలో జగన్నాథుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు విష్ణుపారాయణం, సహస్రనామార్చన చేశారు. ఈ కార్యక్రమంలో ఆల య చైర్మన్ నాయుడు, ధర్మకర్తలు గెద్దాడ సత్యవతి, గిల్లా శ్రీనివాస్‌బాబు, వంతల దేవరాజు, బోర్డ్ సన్యాసమ్మ, కామాక్షి భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

మోదీ తొమ్మిదేళ్ల పాలనపై సావనీర్ల పంపిణీ

గాజువాక: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనపై రూపొందించిన సావనీర్లను బీజేపీ నాయకులు గాజువాకలో సోమవారం పంపిణీ చేశారు. ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులను కలిసి సావనీర్లను అందించారు. తొమ్మిదేళ్ల పాలనలో సాధించిన విజయాలు, అందించిన నిస్వార్థ సేవలపై కరపత్రాలు, పుస్తకాల రూపంలో అందజేశామని నర్సింగరావు తెలిపారు.

ఆర్క ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం



విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించి అభినందిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: ఆర్క ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆర్క ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవాన్ని దయాల్‌నగర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఇటీవల మృతి చెందిన రామకృష్ణ కుటుంబ సభ్యులకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురిని ఆర్క అవార్డులతో సత్కరించారు. ప్రతి నెలా తనకు వచ్చే గౌరవ వేతనం రూ.6వేలను ట్రస్ట్‌కు అందజేస్తానని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ప్రకటించారు. ఇందులో భాగంగా ఈ నెల వేతనాన్ని ఎమ్మెల్యే నాగిరెడ్డి చేతుల మీదుగా ట్రస్ట్ అధ్యక్షుడు ఎల్లపు నాగేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో తనకాల సత్యనారాయణ, ఆడారి కార్తీక్, ఆనంద్‌రెడ్డి, వినోద్ బాలు, పెంటకోట నాగేశ్వరరావు, వీవీఎస్ సూరిబాబు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



జెడ్సీకి వినతిపత్రం అందజేస్తున్న అర్జీదారులు

గాజువాక: స్థానికంగా వివిధ వార్డుల్లో తాగునీరు, విద్యుద్దీపాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జోనల్ కమిషనర్‌కు సోమవారం వినతులు వెల్లువెత్తాయి. స్పందన కార్యక్రమం సందర్భంగా 64, 68, 70, 86 వార్డుల నుంచి వివిధ కాలనీలకు చెందిన ప్రజలు జోనల్ కమిషనర్ పి.సింహాచలంను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సమస్యలపై అధికారులకు అనేకసార్లు మొరపెట్టుకున్నా పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. స్పందించిన జెడ్సీ ఆయా అధికారులతో మాట్లాడారు. సమస్యలను వెంటనే పరిష్కరించి తనకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. కాగా, రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, యూసీడీ విభాగాలకు సంబంధించి కూడా పెద్ద సంఖ్యలో వినతులు అందాయి. మొత్తం 27 వినతులు అందినట్టు జెడ్సీ తెలిపారు.

అగనంపూడి ఆస్పత్రిలో ఐడీయూ యూనిట్ ప్రారంభం



ఐడీయూ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అగనంపూడి: అగనంపూడి ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన ఐడీయూ యూనిట్‌ను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో రోగులకు సత్వర వైద్య సేవలను అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం నిర్వహించిన హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. ఆస్పత్రిలో మరిన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉష, ఆర్ఎంవో డాక్టర్ జె.భారతి, అభివృద్ధి సొసైటీ సభ్యులు రమణబాబు, గొలగాని శ్రీను, అప్పలనాయుడు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో ఉచిత సేవలు



మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి

గాజువాక: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలపై భారం పడకుండా ఉచిత సేవలు అందించాలని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి కోరారు. 67వ వార్డు పెంటయ్యనగర్ సచివాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జనన, మరణ, వివాహ, కుల ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు సహా ఏ ధ్రువపత్రాన్నైనా ఎటువంటి చార్జీ లేకుండా ప్రజలకు సకాలంలో అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్ ఎస్.ఎం.డి.గౌస్, స్పెషల్ ఆఫీసర్ హేమంత్‌రెడ్డి, నాయకులు అచ్చింనాయుడు, లక్ష్మి, కామునాయుడు, సూర్య, కన్వీనర్లు సాహితి, ప్రశాంతి, జ్యోతి పాల్గొన్నారు.

ఉత్సాహంగా సద్భావన శాకాహార ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీధ్యాన కేంద్రం సభ్యులు

కూర్మన్నపాలెం: బ్రహ్మర్షి పితామహ పత్రీజీ ఆశయ సాధన కోసం శాకాహార జగత్ నిర్మాణంలో భాగంగా కూర్మన్నపాలెం స్వతంత్రనగర్‌లో శాకాహార సద్భావన ర్యాలీ సోమవారం ఉత్సాహంగా సాగింది. శ్రీవినాయక పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకురాలు జయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో సుమారు 350 మంది పాల్గొన్నారు. శాకాహారం తీసుకోవడం వల్ల శరీరంతో పాటు మనసు, బుద్ధి పవిత్రంగా ఉండడంతో పాటు ఆరోగ్యం బాగుంటుందన్నారు. ధ్యానం సర్వరోగ నివారిణి అని తెలియజేసే కరపత్రాలు పంచుతూ, శాకాహార ప్రాముఖ్యతపై నినాదాలు చేస్తూ ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్లు, శ్రీవినాయక పిరమిడ్ ధ్యానకేంద్రం టీం, పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ మాస్టర్లు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరీ



గాయకులు రవికుమార్‌ను సత్కరిస్తున్న స్టీల్‌క్లబ్ పాలకవర్గం

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–1 స్టీల్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన వైఆర్‌కే సంగీత కచేరీ అలరించింది. స్టీల్‌క్లబ్, వైఆర్‌కే అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గాయకులు వై. రవికుమార్, పద్మజ, విజయలక్ష్మి తెలుగు, హిందీ పాటలు పాడి అలరించారు. లాఫ్టర్స్ క్లబ్ రంగారావు బృందం తమ స్కిట్లతో నవ్వించారు. మెజీషియన్ భాషా, శాక్సోఫోన్ సురేష్ తమ ప్రావీణ్యం చాటారు. అంతకు ముందు స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్), స్టీల్‌క్లబ్ చీఫ్ పేట్రన్ ఎస్.సి. పాండే ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉద్యోగులకు రిక్రియేషన్ కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యానిదే అని అతిథులు అన్నారు. ప్రత్యేక అతిథులుగా హాజరైన స్టీల్‌ప్లాంట్ పీపీఎం జీఎం డాక్టర్ జి. రమాదేవి, ఏసీఎస్ జీఎం డాక్టర్ వి. చిట్టిబాబు స్టీల్‌క్లబ్ సభ్యుల కోసం నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. క్లబ్ కార్యదర్శి జి. నారాయణదొర, ఆర్. సత్యనారాయణ, కె.ఎల్. నర్సింహం, పెంటకోట రామకృష్ణ, పి.ఎస్.ఆర్. రాజు, కుంచా సత్యనారాయణ, వీరాస్వామి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల భవితకు సీఎం జగన్ బాటలు

- రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి అమర్‌నాథ్
- మింది జెడ్పీహెచ్‌లో కోరమండల్ ఏర్పాటు చేసిన సైన్స్ లేబొరేటరీ ప్రారంభోత్సవం



మింది జెడ్పీహెచ్ పాఠశాలలో సైన్స్ లేబొరేటరీని ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఎమ్మెల్యే నాగిరెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

అక్కిరెడ్డిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి వసతులు కల్పిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. కోరమండల్ ఇంటర్నేషనల్ కంపెనీ లిమిటెడ్ రూ.8 లక్షల సీఎస్ఆర్ నిధులతో 68వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ లేబొరేటరీని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్ గుడివాడ అనూషతో కలిసి మంత్రి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అమర్‌నాథ్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే ఆంగ్ల భాషను బోధించే కార్యక్రమానికి వైఎస్ జగన్ సర్కారు శ్రీకారం చుట్టిందన్నారు. ఇందు కోసం ఒక విదేశీ సంస్థతో కూడా ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. 8వ తరగతి నుంచి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వేలాది రూపాయల ఖర్చుతో బైజూస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసిన ట్యాబ్‌లను అందజేశామన్నారు. కోరమండల్ కంపెనీ ప్రభుత్వ పాఠశాలలకు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలను మార్చి విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించిన గొప్ప నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. విద్య, వైద్యానికి ముఖ్యమంత్రి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని కొనియాడారు. కోరమండల్ సంస్థ హెచ్ఆర్ హెడ్ ఆర్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు తమ వంతు తోడ్పాటు అందించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎం.సునీత, హెచ్ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ, కోరమండల్ సీఎస్ఆర్ హెడ్ జయగోపాల్, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమావేశమైన పేరెంట్స్ కమిటీ

మింది జెడ్పీ హైస్కూల్‌లో పేరెంట్స్ కమిటీ సమావేశం సోమవారం సాయంత్రం జరిగింది. ఎంఈవో సునీత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల తల్లుల ఖాతాలో వేస్తున్న అమ్మఒడి డబ్బులను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.

ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చడమే ధ్యేయం



లబ్ధిదారులకు చేకూరిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

పెదగంట్యాడ: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాల్‌నగర్ లోవ, సంగం పాక ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లారు. లబ్ధిదారులను కలిసి వారికి చేకూరిన లబ్ధి గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుస్తున్నామని చెప్పారు. గడచిన నాలుగేళ్లలో 95 శాతం పథకాలను అమలు చేశామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, ఎన్వై నాయుడు, బొడ్డు గోవింద్, లోకేష్, గురువినాయుడు, రవి, గొరుసు రామలక్ష్మి, ఒమ్మి ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో



ఆరోగ్య కేంద్రం ప్రారంభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

కూర్మన్నపాలెం: వడ్లపూడి కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సోమవారం సందర్శించారు. కొత్త భవనం సివిల్ పనుల గురించి ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ శివయ్య, ఇంజినీరింగ్ అధికారులు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్వేత వారాహీదేవి అవతారంలో శ్రీమహాదుర్గ



శ్వేతవారాహీదేవి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి దేవాలయంలో సోమవారం వారాహీ నవరాత్రుల పూజలు నిర్వహించారు. ఆషాఢ శుద్ధ పాఢ్యమి సందర్భం నుంచి ఈనెల 28 వరకు నిర్వహించనున్న పూజా కార్యక్రమాల్లో భాగంగా శ్రీమహాదుర్గను శ్వేతవారాహీదేవి అవతారంలో అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు ఫణిశర్మ నేతృత్వంలో అమ్మవారికి తులసి, మారేడు, శ్వేత పుష్పార్చన చేశారు. విద్య, జ్ఞానం, శీఘ్రకామ్యసిద్ధి, మోక్షం కలిగేలా చేయాలంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంతకు ముందు వేకువజామున ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.